క్లుప్తంగా

విత్తనాలపై చర్యలు తీసుకోవాలి



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తూము శివారెడ్డి గురువారం జేసీ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కల్తీ విత్తనాలు విక్రయించే వారి పట్ల కఠినంగా శిక్షించాలన్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు పాడైపోయాయని, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఆసరా రాగా రైతు భరోసాను అందించాలన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యంగా శిక్షా సప్తాహ్

నంద్యాల(న్యూటౌన్): విద్యాభివృద్ధే లక్ష్యంగా వారం రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న బాలికోన్నత పాఠశాల, టెక్కె మున్సిపల్ ఉన్నత పాఠశాల తదితర పాఠశాలల్లో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాల్లో భాగంగా బాలచంద్ర సమతా విద్యానికేతన్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బడ్జెట్‌లో మహిళలకు పెద్ద పీట



మాట్లాడుతున్న మహిళా మోర్చ నాయకురాలు

నంద్యాల(వ్యవసాయం): 2024–25 వార్షిక బడ్జెట్‌లో మహిళలకు పెద్ద పీట వేయడం హర్షణీయమని మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు స్వాతి హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బడ్జెట్‌లో బాలికలకు రూ.3.50 కోట్లు కేటాయించడం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.15 వేల కోట్లు సాయం చేస్తామనడం సంతోషకరమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం సహకారాలు అందించడం మరువలేనిదన్నారు. సమావేశంలో మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ముఖ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని ప్రభుత్వ వైద్యాధికారి గోపాల్ సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో గురువారం స్టాప్ డయేరియా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షా కాలంలో నిమోనియా, డయేరియా, జలుబు, దగ్గు తదితర సీజన్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పరిశుభ్రమైన, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. విరేచనాలు, వాంతులు అయితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న సునీతా మధుసూదన్



మధుసూదన్‌ను పూలమాలతో సన్మానిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నెలో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ద్వారకా తిరుమల గోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకుడు సునీతా మధుసూదన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి సన్మానించారు. అనంతరం సునీతా మధుసూదన్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం శ్రీరంగం నుండి అయోధ్య వరకు అక్టోబర్ 12వ తేదీ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు.

'మధ్యాహ్న భోజనం' పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలన్నారు. విద్యార్థులు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈయన వెంట సభ్యులు బాలాజీ, షాహీద్, చందు, ధను, వీరేష్ ల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

- కుందూతీరాన జోరుగా వరినాట్లు
- ఖరీఫ్‌లో 1,200 హెక్టార్లలో వరిసాగు



బోడెమ్మనూరు సమీపంలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

ఉయ్యాలవాడ : కుందూనదిలో పుష్కలంగా నీరు ఉంది. నదీతీరం వెంట ఉన్న 14 గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో భాగంగా వరి పంట సాగులో నిమగ్నమయ్యారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 42 నుంచి 46 బస్తాలు దిగుబడులు రావడంతోపాటు మార్కెట్‌లో మంచి ధర లభించింది. దీంతో ఈ ఏడాది అన్నదాతలు రెట్టింపు ఆశలతో వరి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటా రూ. 2,320లకు పెంచిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ వరినాట్లను పరిశీలించారు. మాయలూరులో ఓ రైతు మడిలో కూలీలతో కలిసి వరి నాటారు. నాట్ల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ రైతులకు సూచించారు. సాధారణ విస్తీర్ణం 980 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1,200 హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం ఉందని ఏఓ తెలిపారు.

నాణ్యమైన నారుతో మంచి దిగుబడి

నాట్లు వేసే ముందు మంచి నాణ్యమైన నారును రైతులు ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన నారుతో మంచి దిగుబడి వస్తుందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. 10 నుంచి 12 రోజుల ముందు దమ్ చేసి చదును చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నార పూర్తిగా పురివిచ్చుకునే వరకు నీటి తడులు ఇవ్వాలి. ఎదిగిన నారుమడిలో ఉల్లికోడ్ కాండం తొలుచు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరిపాస్ 2.0 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి నారుపై పిచికారీ చేయాలి. ఇలా సస్యరక్షణ చర్యల ద్వారా పెంచుకున్న నారతో మంచి దిగుబడులు వస్తాయని ఏఓ తెలిపారు.



మాయలూరులో కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్న ఏఓ రాజేంద్రకుమార్

భూసేకరణ పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర భూసేకరణకు సంబంధించి ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, ఎం.దాసు, మహేశ్వర్ రెడ్డిలు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, నేషనల్ హైవే పీడీ గోవర్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 340సి ప్యాకేజీ 4 కింద జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు మండలాలు మీదుగా వెళ్లే రహదారి భూసేకరణకు సంబంధించి 75.47 ఎకరాలు పెండింగ్‌లో ఉందని, ఇందుకు సంబంధించి తహసీల్దార్ల నుంచి క్లెయిమ్స్ తెప్పించుకొని పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీఓలకు సూచించారు. 167కె ఒకటవ ప్యాకేజీ కింద (నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు) నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల మీదుగా వెళ్లే రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డ్సను త్వరితగతిన పాస్ చేయాల్సిందిగా నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. 167కె ప్యాకేజీ 4 కింద 5 మండలాలు 22 గ్రామాలకు చెందిన 177 ఎకరాల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇందుకు సంబంధించి తహసీల్దార్ల నుంచి నివేదికలు తెప్పించుకొని సమర్పించాలన్నారు. 167కె ప్యాకేజీ – 5 కింద నల్లకాలువ నుంచి వెలుగోడు వరకు 3ఏ ప్రతిపాదనలను ఏపీఆర్‌డీసీ కార్యనిర్వహణ అధికారి నుంచి ప్రతిపాదనలు తెప్పించుకోవాలన్నారు. రోడ్లు భవనాలు సంబంధించి రహదారుల విస్తరణ, రైల్వే ప్రాజెక్టులు, సిమెంట్ పరిశ్రమలు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చుక్కల భూములు, అన్యాక్రాంత భూములకు సంబంధించిన ప్రతిపాదనలు, నివేదికలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం డిపో మేనేజర్ గంగాధర్‌రావు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే 99592 25800 నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రయాణికులను కోరారు.

కొనసాగుతున్న ఆధార్ క్యాంప్‌లు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 23 నుంచి చేపట్టిన ఆధార్ క్యాంప్‌లు కొనసాగుతున్నాయి. మొదట కోటకొండ, ఆర్.నాగులవరం గ్రామాల్లో నిర్వహించారు. గురువారం ఎల్లావత్తుల, ఆలమూరు గ్రామాల్లో క్యాంప్ ఏర్పాటు చేశారు. అయితే ఆలమూరు క్యాంప్‌లో సాంకేతిక కారణాలతో ఆధార్ కార్డుల్లో మార్పులు సాగలేదు. ఎల్లావత్తులలో మాత్రం 25 కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి పాములేటి తెలిపారు.

ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి

దొర్నిపాడు: ప్రభుత్వ పథకాలు పొందాలంటే లబ్ధిదారులు తప్పని సరిగా ఆధార్‌కార్డును అప్డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని కొండాపురం, గుండుపాపల గ్రామాల్లో ఆధార్ కార్డుల్లో డిజిటల్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, సౌజన్య 82మందికి చేసినట్లు చెప్పారు. శుక్రవారం డబ్ల్యూ గోవిందిన్నె, బుర్రారెడ్డి పల్లె గ్రామాల్లో ఆధార్ సేవలు నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలపారు. ఆయా గ్రామస్తులు ఆధార్‌లో ఎమైనా తప్పులుంటే సవరించుకోవాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. బాటనీ పోస్ట్ ఖాళీగా ఉందని, పీజీ బాటనీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు ఈ నెల 31న నిర్వహించే డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

27న రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27, 28 తేదీల్లో స్థానిక ప్రథమనంది టెంపుల్ ఆవరణంలో రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహించనున్నట్లు జంప్‌రోప్ రాష్ట్ర అధ్యక్షులు రమణ, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ స్కూల్ అధినేత సుధాకర్‌లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ క్రీడా భారతి, జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో 600 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఎస్వీవై రెడ్డి కూతురు సుజల భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎల్‌కేఆర్ స్కూల్ అధినేత కల్యాణ్, సుధాకర్, రమేష్, పక్కిరయ్య, క్రీడాభారతి ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకోవాలి

దొర్నిపాడు: శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నాల్గవ రోజు గురువారం అన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సంస్కృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చూపిస్తూ వారి సేవలను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. కార్యక్రమాలను ఎంఈఓ రామచంద్రయ్య పర్యవేక్షించారు. ఎచ్ఎం రాజాదస్తగిరి, ఉపాధ్యాయులు రజాక్, రామనందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: గ్రామాల్లో నిర్వహించే ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కుటుంబానికి బాత్‌రూములు, టాయిలెట్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. ముందుగా 26వ తేదీ వరకు గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రభుత్వ సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

లక్ష్యాలు సాధించవచ్చు



శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ సోమశేఖర్

నంద్యాల(న్యూటౌన్): తరగతిలో ఉపాధ్యాయుడి బోధనాభ్యసన ప్రక్రియను అంచనా వేసేందుకు టీచ్ టూల్ ఉపయోగపడుతుందని ఎస్‌ఈఆర్‌టీ స్టేట్ అబ్జర్వర్ సోమశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను ఆయన తనిఖీ చేశారు. శిక్షణ ఎలా ఉందని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ లలిత ఉన్నారు.

జలాశయాలకు నీటిని విడుదల చేయాలి

నంద్యాల(సెంట్రల్): శ్రీశైలం జలాశయానికి భారీగా వస్తున్న వరదతో నీటిమట్టం 854 అడుగులకు చేరినందున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, కృష్ణా నదుల్లో ఆశాజనకంగా ప్రవాహాలు ఉన్నందున రాయలసీమ జిల్లాలకు సాగునీటిని అందించే కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీనీవా ప్రాజెక్టులకు నీటి విడుదలపై వెంటనే సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వై ఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, సౌదాగర్ ఖాసీం మియా, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పర్వేజ్, మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాగునీటి సాధన సమితి నాయకులు

భక్తిశ్రద్ధలతో జియారత్

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో గురువారం దస్తగిరి స్వామి పీరు జియారత్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొహరం ముగిసిన తొమ్మిది రోజులకు జియారత్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గ్రామ పెద్దలు కలిసి దస్తగిరి స్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించి ఫాతెహాలు సమర్పించారు. అలాగే భక్తులు మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి దస్తగిరి స్వామికి పూల దట్టీలు సమర్పించి మొక్కుల చెల్లించుకున్నారు.

వీధి కుక్కల బారి నుంచి రక్షించండి

నంద్యాల(సిటీ): ప్రజలను వీధి కుక్కల బారి నుంచి రక్షించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ కోరారు. వీధి కుక్కల దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గురువారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్, ధనుంజయ్ పాల్గొన్నారు.



మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకుందాం

నంద్యాల(అర్బన్): భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని అయ్యలూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాల హెచ్ఎం అబ్దుల్‌అజీజ్ అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



చిన్నారులతో ఉపాధ్యాయులు

నంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్

బొమ్మలసత్రం: నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్ లేని 52 బైకులను సీజ్ చేశామన్నారు. నంబర్‌ప్లేట్ లేని వాహనదారులు వాహనం సీజ్ చేసిన తర్వాత నంబర్ ప్లేట్‌తో పాటు సరైన పత్రాలు తెచ్చి వాహనాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు.

కొనసాగుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే



లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అధికారి రమణ



కదిరిపురం తాండలో నిర్వహిస్తున్న కుష్టు సర్వేను పరిశీలిస్తున్న తస్లీమా సుల్తాన

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో లెప్రసీ సర్వే కొనసాగుతోంది. గురువారం మండల కేంద్రమైన రుద్రవరంలో పీహెచ్‌సీ సిబ్బంది సర్వే చేపట్టగా నంద్యాల జిల్లా అధికారి రమణ పరిశీలించారు. అనుమానిత కేసులను గుర్తించి వారిని పీహెచ్‌సీకి పిలిపించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచనలు ఇచ్చారు. చర్మంపై మచ్చలు, స్పర్శలేని మచ్చలు, కళ్లు మూసుకు పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కదిరిపురం తాండలో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేను గురువారం ప్రభుత్వ వైద్యాధికారిణి తస్లీమా సుల్తాన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కొంతమంది వ్యాధి అనుమానితులను పరిశీలించారు. ఏదైన స్పర్శ లేని మచ్చలుంటే వారిని పీహెచ్‌సీకి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ మనోహర్, సీహెచ్‌ఓ వాణి, అంగన్‌వాడీ కార్యకర్త బాల కుళ్లాయమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుపై దృష్టి సారించాలి

చాగలమర్రి: ఉద్యాన సాగుకు ప్రోత్సహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి ఏపీఓ నిర్మలాదేవి సూచించారు. గురువారం మండలంలోని కదిరిపురం తండాలో ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 149 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులను గుర్తించామన్నారు. ఈ ఏడాది మండలంలో 350 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగుకు 100 శాతం సబ్సిడితో 5 ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని చెప్పారు. ఈ పథకం క్రింద రైతులు 16 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చని సూచించారు.



కదిరిపురం తండా ప్రజలతో మాట్లాడుతున్న ఏపీఓ నిర్మలాదేవి

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువులు దుకాణాలను తనిఖీ చేస్తున్న మురళీకృష్ణ

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా సరిపడా నిల్వ చేసుకొని, రైతులకు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాకాధికారి మురళీకృష్ణ డీలర్లకు సూచించారు. గురువారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీ నిర్వహించారు. శివ సంతోష్ రెడ్డి ఏజెన్సీస్ దుకాణంలో ఎరువులు, పురుగుమందుల నిల్వలు, రిజిస్టర్లు, బిల్ బుక్స్, ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్దేశించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించరాదని, రైతులకు కావాల్సిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు పాల్గొన్నారు.

సబ్సిడీ సరుకులను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ద్వారా పేదలకు సబ్సిడీపై అందించే నిత్యావసర సరుకులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరాముడు తెలిపారు. స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో జిల్లా హోల్‌సేల్ మండి మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్సిడీ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన డీటీ ప్రసాదరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్ బీపీటీ సోనా మసూరి రూ.49, బీపీటీ సోనా మసూరి రూ.48తో మూడు రకాల సరుకులను అందజేస్తున్నామన్నారు. జిల్లాలో నంద్యాల మార్కెట్‌యార్డు, ఆళ్లగడ్డ రైతు బజార్, ఆత్మకూరు మున్సిపల్ కాంప్లెక్స్, నందికొట్కూరు మున్సిపల్ కాంప్లెక్స్‌లలో కౌంటర్లు ఏర్పాటు చేశామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు అమీర్‌బాషా, సభ్యులు నాగేంద్రరావు, శ్రీనివాసులు, రజినీకాంత్, సూర్యనారాయణ, బద్రీస్ శెట్టి సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, శివ పాల్గొన్నారు.



వినియోగదారులకు కందిబేడలు అందజేస్తున్న డీఎస్ఓ వెంకటరాముడు

సీబీసీఐడీతో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత

నంద్యాల(న్యూటౌన్): పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారి అదృశ్యం కేసును సీబీసీఐడీతో విచారణ జరిపించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజిత డిమాండ్ చేశారు. ఇది విషయమై గురువారం ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవితో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అరికట్టడంలో హోంశాఖ మంత్రి పూర్తిగా వైఫల్యమయ్యారన్నారు. అదృశ్యమై 20 రోజులైనా జాడ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకురాళ్లు షమీమ్‌బేగం, లక్ష్మీదేవి, ముర్తుజాబీ, సుశీలమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి

గోస్పాడు/నంద్యాల(అర్బన్): గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సెంట్రల్ టీం సభ్యులు డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. గోస్పాడు మండలంలోని సాంబవరం, జూలేపల్లి, నంద్యాల మండలంలోని పాండురంగాపురం గ్రామాల్లో గురువారం సెంట్రల్ టీం సభ్యులు పర్యటించారు. బహిరంగ మలవిసర్జన చేయరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి బాత్ రూంలు, టాయిలెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు, అమలవుతున్న పనులు, పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పనులపై, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు గ్రామ స్థితిగతులపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐజయ్య, ఎంపీడీఓలు నాగఅనసూయ, సౌభాగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నవీన, మురళీమోహన్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో విద్యార్థులకు ప్రవేశం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కేఎస్ఎం పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశం కల్పించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. గురువారం వన్ ఆంధ్ర మేడ్ కాయి యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ మేనేజర్ వైవీ కేసిరెడ్డి ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్లు రవికుమార్, భరత్, సుబ్బారావు, పవన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. అలాగే ఆళ్లగడ్డ, పాలసాగరం, దీబగుంట్ల, గురురాజ పాఠశాల, భారత్ స్కూల్, ఈర్నపాడు జిల్లా పరిషత్ హైస్కూళ్ల విద్యార్థులను కూడా ఎన్‌సీసీలో చేర్చుకున్నట్లు తెలిపారు.



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాలిక ఆచూకీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): ముచ్చుమర్రి బాలిక ఆచూకీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న డిమాండ్ చేశారు. స్థానిక వాల్మీకి కార్యాలయంలో గురువారం సంఘం నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్య చేసి 18 రోజులవుతున్నా ప్రభుత్వం బాలిక ఆచూకీని కనిపెట్టడంలో విఫలమైందన్నారు. దీని వెనుక భారీ కుట్ర దాగి ఉందని, సీబీసీఐడీతో విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వం రెండు మూడురోజుల్లో స్పష్టత ఇవ్వకపోతే ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కుమార్, మల్లికార్జున, సవారి, మద్దిలేటి, మధు, పరమేష్ పాల్గొన్నారు.